# 29. సాహిత్యతిరునాళ్లు

తెలుగుదేశంలోని ప్రతి నలుగురిలో ఒకడు కవి, ఇంకొకడు రచయిత, మరొకడు విమర్శకుడు అని సగర్వంగా చెప్పుకొంటూంటారు.

ఈ లెక్కన ఆ నాలుగోవాడు పాఠకుడన్న మాట! ఈ మూడు రకాలవాళ్ళూ కలసి ఆ నాలుగోవాడి ముందు ఫోజులు కొడతారు. తమ గొప్పదనాన్ని గుర్తించి గౌరవించమంటారు. తాము అతనికన్నా ఉన్నతోన్నతులమని డబ్బాకొట్టుకుంటారు. యథాశక్తి ఇతర్లనుకూడా కొట్టమంటారు తామే ఈ ప్రపంచాన్నర్థం చేసుకున్నవాళ్ళం, చేసుకోగల వాళ్ళం, విప్పి చెప్పగలవాళ్ళం. మార్గోపదేశం చేయగల మహానుభావులం. మేధావులం అని బల్లలు గుద్దుకుంటారు.

కానీ జరుగుతున్న సంఘటల్ని చూస్తుంటే ఈ మూడు వర్గాలవారినీ కలిపి మందవేస్తే, వారిలో సగానికి సగంమంది బఫూన్‌గాళ్ళేగానీ, మేదావులెంత మాత్రమూ కాదేమోననే అనుమానం కలగక తప్పదు.

లేకుంటే రచయితల మహాసభలనబడే వాటిలో మంత్రులూ ఆ బాపతువాళ్ళూ వేదికలను ఆక్రమించుకున్నా

ర్చుంటే వారివద్ద పాఠాలు నేర్చుకోవటానికి వచ్చిన బడిపిల్లల్లా మేధావులం అనుకునేవాళ్ళంతా చేతులు కట్టుక్కూర్చోవటం, గౌరవనీయులైన వేదికమీది పెద్దలు తుమ్మినా, దగ్గినా చప్పట్లు కొట్టటం, వారి పరిచయ భాగ్యంకోసం తహతహ లాడటం ఇవన్నీ బఫూనరీ లక్షణాలా లేక మేధావి లక్షణాలా?

మొన్న అఖిలభారత రచయితల మహాసభ అంటూ ఒకటి జరిగింది. సభలు ఎన్ని జరిగినా మంచిదే. కాని, ఆ సభలు ఎందుకు ? ఏ లక్ష్యసాధనకోసం ? అనే ప్రశ్నకు సమాధానం నిర్వాహకులే చెప్పుకోలేకపోతే ఆ సభలు శుద్ధ దండగన్న మాటే. 'సాహిత్యాభిలాషులు, సాహితీవేత్తలు, పోషకులు వందలసంఖ్యలో ఒక చోట చేరి, సుహృద్భావ వాతావరణంలో చర్చలు, సమాలోచనలు జరిపినపుడు సిద్ధించగల ప్రయోజనాలను, సత్ఫలితాలను గురించి వేరే చెప్పనవసరం లేదనుకుంటాను' అని కార్యదర్శిగారు రాసుకొన్నారొక చోట.

ఆ చర్చలు సమాలోచనలు ఎలాంటివి ? మొదటిరోజు ప్రారంభసభలో మాట్లాడిన వారెవరూ రచయితలు కారు.

పుస్తక, చిత్రలేఖన ప్రదర్శనలు అంటూ ఓ రెండు జరిగాయి. తెలుగు అకాడమీవారి పాఠ్యగ్రంథాలూ, ఎమెస్కోవారి పుస్తకాలూ తప్ప- తెలుగుసాహిత్యం మరేమీ దొరకలేదా నిర్వాహకులకు ? ఏ మామూలు బుక్‌స్టాల్‌కు వెళ్ళినా ఈ ప్రదర్శనలో ఉన్న పుస్తకాలకు పదిరెట్లు కనిపిస్తాయే ? మరైతే ఈ మొక్కుబడి ప్రదర్శనలు ఏ లక్ష్యసాధనకు ?

రెండోరోజు ఓ రెండు పుస్తకాలు ఆవిష్కరించి వాటిని గురించి ఓ అరడజను మంది ఉపన్యసించారు. ఈ రెండూ తెలుగుసాహిత్య పురోగమనానికి (?) తోడ్పడతాయని నిర్వాహకుల ఆశ.

'తెలుగు భాషాపరిణామం- నేటి అవసరాలు' గురించి మరోచర్చ. ఇందులో మరో పదిమంది ఉపన్యాసాలు. 'అయ్యా తెలుగుభాషా పరిణామాన్ని పత్రికలూ - రచయితలూ నిర్దేశించేస్తున్నారు మీ పాండిత్యం వల్ల ఒరిగి చచ్చేదేం లేదు'అని చెప్పగల మేధావి శ్రోత ఒక్కడూ ఆ సభలో కనిపించక పోవటం పెద్ద తమాషా !

ఆధునిక సాహిత్యం - విశ్వజనీనత, సినిమాలు - సాహిత్యం, ఇతర భాషల్లోని తెలుగుసాహిత్యం, తెలుగు కన్నడ సంబంధాలు, రచయితలు సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలా ? అనేవి మరికొన్ని చర్చలు. మొత్తంమీద అన్ని కార్యక్రమాలకూ కలిపి ఓ డెభ్భై మంది దాకా కవులు, రచయితల పేర్లిచ్చారు గానీ వారిలో సగంమంది కూడా సభలకు రానేలేదు. వచ్చిన వారెవరూ ఈనాటి మన తెలుగు సాహిత్యరంగంలో చెప్పుకోదగిన స్థానం సాధించుకున్నవారు గారు. వచ్చిన సభాసదుల్లో మూడువంతుల మంది నిన్నటి మొన్నటి రచయితలు, రిటైరయిపోయిన కవిపండితులు. మిగిలిన వారు ఇప్పుడిప్పుడే సాహితీ ప్రపంచంలో తమ చోటు ఎక్కడ అని వెదుక్కుంటూ వచ్చినవారు.

వీరంతా కలిసి సభల్ని తిరణాలగా తీర్చిదిద్దారంటే కోప గించుకోవటం అనవసరం, ఆత్మవిమర్శ మంచిది. రైల్వే కన్సెష న్‌తో చవగ్గా విడిది-భోజనం ఏర్పాట్లతో బెంగుళూరు చూసి వద్దామంటే మంచిదే! ఎవరూ వద్దనరు .కానీ, ఈమాత్రం పిక్ని క్‌లకు, మంత్రుల, వారి తైనాతీల ఊకదంపుడు ఉపన్యాసాల భాగోతానికి 'అఖిలభారత తెలుగురచయితల మహాసభ'లనే పెద్ద పేరు తగిలించటం మాత్రం క్షమించరాని నేరం.

(నవంబర్ 1974)